# టేక్సీ

## గుండాన జోగారావు

కోల్‌కతా సర్క్యులర్ రైల్ బిబిడిబాగ్ స్టేషన్‌లో టికెట్ కలెక్టర్‌గా పోస్టింగయి చార్జి తీసుకున్న రోజు సీనియర్ టీసీ మదన్‌మిత్రా 'డెయిలీ టూ పాయింట్ మెయింటెయిన్ చెయ్యడం మర్చిపోవద్దు' అన్నాడు.

"అంటే" అడిగాను అర్థం కాక.

"అదేనయ్యా రోజుకు రెండు టిక్కెట్టు లేని కేసులు పట్టుకుని పెనాల్టీతో సహా వసూలు చేసి రసీదు రాయాలి లేకపోతే ఎంత కొత్తవాడయినా మూడు నెలలు తిరక్కుండా 'లో అర్నింగ్' చార్జిషీటు రావడం ఖాయం" అనుభవ పూర్వకంగా చెప్పాడు సీనియర్ టీసీ.

"ఒకవేళ కేసులు దొరక్కపోతే...."

మిత్రా భళ్ళున నవ్వాడు..." రైల్లో టిక్కెట్టు లేకుండా ప్రయాణించేవారు లేరని అంటే నమ్ముతూ 'అలాగా' అని ఆశ్చర్యపోవడానికి అడ్మినిస్ట్రేషన్ చెవిలో పువ్వు పెట్టుకుని లేదు. ఆఫీసర్లు అందరూ గతంలో టికెట్ చెకింగ్ బ్రాంచిలో పనిచేసి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్తో పైకి ఎదిగినవారే".

నా గుండెలో రాయి పడ్డట్టయింది. 'ఇదెక్కడి చిక్కురా బాబూ' అనుకున్నాను మనసులో. కాలక్రమేణా సీనియర్ టీసీ పర్యవేక్షణలో ప్రాక్టికల్ వర్క్‌లో తర్ఫీదు పొంది స్వతంత్రంగా పెనాల్టీ కేసులు బుక్ చేయడం మొదలుపెట్టాను. డెయిలీ పాసింజర్లను వదిలేస్తూ... స్టూడెంట్లను చూసీ చూడనట్టు దాటేస్తూ... కొత్తమొహాలు కన్పిస్తే రంచనుగా టిక్కెట్టు చెక్ చేస్తున్నాను. ఐదేళ్ళు నిండిన పిల్లల విషయంలో ఖరాఖండీగా వ్యవహరిస్తూ ఏమాత్రం అవకాశం దొరికినా కేసులు పెనాల్టీతో రాసేస్తున్నాను. మంత్లీ అర్నింగ్ టార్గెట్ చేరుకోవడానికి




శతవిధాలా ప్రయత్నిస్తున్నాను.

మొదటినెల ఫర్వాలేదు. రెండోనెల ఖర్మకాలి కేసు లేవీ అంతగా చిక్కలేదు. సీనియర్ టీసీకి విషయం చెప్పాను. తన డ్యూటీసమయంలో మిత్రా గేటు దగ్గర నిలబడి నన్ను దొంగదారుల్లో యూనిఫారం లేకుండా నిల్చోబెట్టి టిక్కెట్టులేని కేసులు పట్టించి రసీదు రాయించేవాడు.

ఆఖరివారం ఫస్ట్‌షిఫ్టులో నాడ్యూటీ పడింది. నెలలో రెండు రోజులు మిగిలింది. ఒకే వర్కింగ్‌డే. తర్వాత రోజు రెస్ట్. ఆ రోజు కనీసం రెండు కేసులు దొరికితే వర్కింగ్‌డేస్ ప్రకారం కేసులు టార్గెట్ చేరుకున్నట్టే.

ఒక చేపల బుట్ట ట్రైన్లోంచి దిగితే అన్‌బుక్డ్ లగేజి కేసుని టికెట్‌లెస్ కేసుగా మార్చిరసీదు రాసి నా దగ్గరే ఉంచుకుని గేట్ పాస్ చేసాను. ఇంకొక్క కేసు మిగిలింది ఒకే ట్రైన్. రాత్రి ఎనిమిదిగంటలకు డ్యూటీ ఆఫ్ అవుతాను. ఏడూ నలభై నిమిషాలకు 'సి-17' అప్ ట్రైన్ వస్తుంది. ట్రైన్ లైన్ క్లియర్ కావడంతో అలర్ట్ అయ్యాను. బండి వచ్చింది. పాసింజర్లు పలుచగా ఉన్నారు అయితే ఒకామె ట్రైన్ దిగి టీస్టాల్ ప్రక్కన నిల్చుండిపోవడం గమనించాను. దగ్గరగా వెళ్ళాను.

"టిక్కెట్"

ఆమె నా కళ్ళలోకి చూసి తల దించుకుంది.

"నిన్నే"

"టిక్కెట్ నెయ్" – బెంగాలీలో సమాధానం.

టీస్టాల్ వాడు చిన్నగా నవ్వుతున్నాడు ఆమె దగ్గర టిక్కెట్ లేదు.

"రా నాతో"

ఆమె నిశ్శబ్దంగా నన్ను వెంబడించింది. టీసి రూంకి తీసుకెళ్తుంటే స్టేషన్‌మాస్టర్ సురజిత్‌సేన్ కన్పించాడు. నమస్కరించిందామె.

"కీ హోలో"

ఏమైందని అడిగాడు. టిక్కెట్ లేని కేసు అని చెప్పాను.

"ఛోడ్‌దేవ్"

స్టేషన్ మాస్టర్ చెప్పడంతో గత్యంతరం లేక వదిలేసాను. వెళ్ళిపోతున్న ఆమెని చూపిస్తూ "అరే....ఏ తో ఈడెన్ గార్డెన్స్ ఈలా... టేక్సీ" అన్నాడు.

అర్థం కాక అతని మొహంలోకి చూసాను.

"కారు స్వంతమైనది... టేక్సీ అద్దెకొచ్చేది... అర్థమైందా?" నవ్వుతున్నాడు స్టేషన్‌మాస్టర్. సిగ్గేసింది. నేనిప్పుడు మానసికంగా సిద్ధమవుతున్నాను చార్జిషీటు అందుకోవడానికి !


స్వగృహ ఫుడ్స్



దసరా, దీపావళి శుభాకాంక్షలు

Swagruha® Foods

Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10

Phone : 2475763, Fax : 0866 - 2480200.

Eluru Road (Canara Bank Building),

Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.

10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.

Visit us : www.swagruhafoods.net